క్లుప్తంగా

30న కౌన్సిల్ సాధారణ సమావేశం

రేపల్లె: మున్సిపల్ సమావేశ హాలులో ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

1న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు, రాష్ట్ర స్థాయి సెలక్షన్‌లు నిర్వహించబడునని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారిని జూన్ 9, 10, 11 తేదీలలో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే తైక్వాండో క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో, జనన ధ్రువీకరణ పత్రంతో 1వ తేదీ ఉదయం 8 గంటలకు హాజరుకావాలన్నారు.

స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాల పరిశీలన



చెరుకుపల్లి: చెరుకుపల్లి మండలానికి ఉచిత పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింటుకు చేరాయని ఎంఈవో-1 టి.నవీన్‌కుమార్, ఎంఈవో-2 పులి లాజర్ తెలిపారు. చెరుకుపల్లి మండలంలో 74 ప్రభుత్వ పాఠశాలల్లో 5,260 మంది విద్యార్థులకు 16,217 పుస్తకాలకు గాను 15,055 పుస్తకాలు అంటే దాదాపు 90 శాతం పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఇంకా 1,157 పుస్తకాలు రావాల్సి ఉందని, అవి కూడా వచ్చిన వెంటనే ఆయా పాఠశాలలకు పుస్తకాలతో పాటు కిట్లు కూడా పంపిణీ చేస్తామని ఎంఈవోలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను ఎంఈవో పులి లాజర్ పరిశీలించారు.

పశువులకు 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ



వేమూరు: వేసవి కాలంలో పశువులకు మేత కొరత ఉండటం వల్ల ప్రభుత్వం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేయడం జరుగుతుందని వెటర్నరీ ఏడీ జనార్ధన్ తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 50 శాతం సబ్సిడీపై దాణాను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. రైతులందరు పశువులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న దాణాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జొన్నలగడ్డ విజయబాబు, రైతులు పాల్గొన్నారు.

బడి బాట ప్రచారం



చుండూరు(వేమూరు): బడి ఈడు, బడి మానేసిన బాలలందరూ ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం నమోదు కావాలని బడి బాట ప్రచారకర్త బట్టు వెంకయ్య అన్నారు. చుండూరు మండలంలోని నడ్డిగడ్డ పాలెం ఎస్టీ కాలనీలో అక్షర కోలాటం ద్వారా బడి బాట ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5-14 వయస్సు ఉన్న ఎస్టీ పిల్లలందరూ విద్య నభ్యసించాలని, బడి ఈడు, బడి మానేసిన పిల్లలను 100 శాతం బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు పిల్లలను బాడి బాట పట్టించాలని ఆయన కోరారు. తల్లికి వందనం పథకం జూన్‌లో పొందొచ్చన్నారు. కుల వృత్తులకు పిల్లలను తీసుకెళ్లవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లతో ఆర్థికాభివృద్ధి

ప్రత్తిపాడు: స్వయం ఉపాధి యూనిట్లతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించవచ్చని ప్రత్తిపాడు వెలుగు ఏపీఎం వి.లాజరు అన్నారు. యాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు గ్రామాల్లో మైక్రో క్రెడిట్ ప్లాన్‌ల తయారీపై డ్వాక్రా గ్రూపులకు సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన ఏపీఎం లాజరు మండలంలో ఈ ఏడాది 930కు పైగా గ్రూపులకు ఎంసీపీలు తయారు చేసి బ్యాంకులకు పంపడం జరుగుతుందన్నారు. సంఘాల్లో ఉన్న సభ్యులంతా స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు బ్యాంకర్ల సహకారంతో రుణాలిప్పించడం జరుగుతుందని ఏపీఎం చెప్పారు. అందుచేత గ్రామైఖ్య సంఘాల సభ్యులు, గ్రూపుల లీడర్లు సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎంసీపీలు పక్కాగా తయారు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతను అందిస్తుందని వివరించారు. సమావేశంలో వీవోఏలు, డ్వాక్రా లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

భారమైన పశు పోషణ



బాపట్ల నుంచి తరలిపోతున్న గేదెలు



దూర ప్రాంతాల నుంచి గడ్డిని కొనుగోలు చేస్తున్న పశు పోషకులు

- భగ్గుమంటున్న ఎండు గడ్డి ధరలు
- పోషించలేక పశువులను కటిక శాలలకు తరలిస్తున్న వైనం

బాపట్లటౌన్: మండలంలోని మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన మరుప్రోలు శ్రీనివాసరెడ్డి ప్రతి ఏడాది రెండు ఎకరాలు వ్యవసాయం చేస్తూ.. మరో రెండు ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి దాంతో మూడు పాడి గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ప్రస్తుతం వ్యవసాయంలో పెరిగిన ఖర్చులను భరించలేక పంటలను హార్వెస్టింగ్ చేయించారు. దీంతో ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. ప్రస్తుతం గేదెలను పోషించాలంటే నాలుగు ఎకరాలు గడ్డిని బయట నుంచే కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రస్తుతం ఎకరం గడ్డి రూ.15 వేల మేర ధర పలుకుతుంది. దీంతో నాలుగు ఎకరాలు గడ్డిని కొనుగోలు చేయాలంటే రూ.60 వేలు వెచ్చించాల్సి వస్తుంది. వీటితోపాటు దాణాలు, తవుడు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అయినప్పటికీ ఏడాదిపాటు అదే రీతిలో పోషించాడు. ప్రస్తుత పరిస్థితుల్లో పశువులను పోషించడం సాధ్యపడే పరిస్థితులు కనిపించడం లేదంటూ ఉన్న మూడు గేదెలను విక్రయించి.. కూలీ పనులకు వెళ్తున్నాడు. ఇదే విధంగా మండలంలోని మరుప్రోలువారిపాలెం, అసోదివారిపాలెం, ముత్తాయపాలెం, బసివిరెడ్డిపాలెం, వల్లువారిపాలెం, నరసాయపాలెం, కంకటపాలెం, జమ్ములపాలెం, వెదుళ్ళపల్లి, బేతపూడి, పాండురంగాపురం గ్రామాల నుంచి రోజుకు సుమారు 10 నుంచి 40 గేదెల వరకు కటిక శాలలకు తరలి వెళ్తూనే ఉన్నాయి.

హార్వెస్టింగ్‌తో గడ్డి కొరత

ప్రస్తుతం వ్యవసాయ పనులు చేసే కూలీల సంఖ్య రోజురోజుకు తగ్గిపోవడంతో పనులు చేసే అతికొద్ది మంది ధరలు అమాంతం పెంచేశారు. ఓ వైపు వరుస వాయుగుండాలు, తుపాన్లు రావడంతో పైర్లు పూర్తిగా దెబ్బతినిపోవడం, దీనికి తోడు ఎరువులు, పురుగుమందుల ధరలు అమాంతం పెరిగిపోవడం, కూలీల కొరత, పెరిగిన కూలీ రేట్లు.. ఇలా పలు కారణాలతో గత్యంతరం లేక రైతులు హార్వెస్టింగ్‌కు అధిక ప్రాధాన్యత చూపుతున్నారు. గతంలో రైతులు పైర్లు కోతకోసి కట్టివేత వేసుకొని కుప్పనూర్పిడి చేసేవారు. ఈ విధానంలో వ్యవసాయం చేయటం వలన ఎకరాకు ట్రాక్టర్ గడ్డి వచ్చేది. నేరుగా హార్వెస్టింగ్ చేయటం వలన అతి తక్కువ గడ్డి మాత్రమే వస్తుంది. పైగా గేదెలు హార్వెస్టింగ్ చేసిన గడ్డిని ఇష్టంగా తినకపోవడం, గడ్డి మొత్తం తిరిగి ఎరువు దిబ్బలో వేయాల్సి వస్తుందని పశు పోషకులు వాపోతున్నారు. పెరిగిన ఖర్చులను భరించలేక.. గత్యంతర లేక పశు పోషకులు పశువులను కటిక శాలలకు తరలిస్తున్నారు.

కూలి పనులకు పోతున్నాను

ప్రస్తుతం పెరిగిన దాణా, తవుడు ఖర్చులతో సతమతమవుతున్నాం. గతంలో పొలంలో పంటలు పండించిన ఎండు గడ్డిని వాములు వేసుకునేవారిమి. మా పొలంలోని ఎండు గడ్డితోపాటు బయట రెండు ఎకరాలు కొనుగోలు చేసుకొని గేదెలను పోషించుకునేవారిమి. ప్రస్తుతం ఎకరం ఎండు గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.15 వేలు ఖర్చుచేయాల్సి వస్తుంది. దీంతో చేసేది లేక ఉన్న రెండు గేదెలను విక్రయించుకొని కూలి పనులకు పోతున్నాను.

– వల్లు శ్రీనివాసరావు, వల్లువారిపాలెం

కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

వైఎస్సార్‌సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: గ్రామాల్లో ఏ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అన్యాయం జరిగిన పార్టీ పరంగా వారికి అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ భరోసానిచ్చారు. మంగళవారం గుళ్ళపల్లిలోని ఆయన కార్యంపు కార్యాలయంలో మండల పరిధిలోని పొన్నపల్లి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పొన్నపల్లి గ్రామంలో గత రెండు రోజుల క్రితం జరిగిన కారుమూరమ్మ అమ్మవారి తిరునాళ్లలో పోలీసులు కూటమి నాయకుల మెప్పు పొందేందుకు గ్రామంలో సంబరం చేసుకునేందుకు కనీసం డీజే అనుమతి నిరాకరించటం దుర్మార్గమైన చర్య అని గత 40 సంవత్సరాలుగా ఎన్నడూ ఈ విధంగా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు గాను 15 పంచాయతీలలో జరిగిన తిరునాళ్లకు భారీ ఫ్లెక్సీలు, మూడు నుంచి నాలుగు డీజేలకు వరుసగా రెండు రోజులు అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. పొన్నపల్లి గ్రామంలో రెడ్డి సామాజిక వర్గం కేవలం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే ఎటువంటి అనుమతులు ఇవ్వకుండా వందలాది మంది పోలీసు సిబ్బందిని మొహరింపజేసి గ్రామంలోని ప్రజలను భయబ్రాంతులకు గురి చేశారని గణేష్ మండిపడ్డారు. పొన్నపల్లిలో జరిగిన హైడ్రామా అంతా కూడా పార్టీ అధినాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వివరించటం జరిగిందని, జగనన్న కూడా స్పందించి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందాం అని ప్రతి ఒక్క కార్యకర్తకు నియోజకవర్గ సమన్వయకర్తలు అండగా ఉండమని సూచించారని కార్యకర్తలకు గణేష్ వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, పొన్నపల్లి గ్రామ ఉప సర్పంచ్ సుభాని రెడ్డి, తుమ్మ రవికుమార్ రెడ్డి, పైనం కరిముల్లా రెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



డాక్టర్ ఈవూరు గణేష్‌ను సత్కరిస్తున్న అహరోన్‌పాల్

రేపల్లె: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా నియమితులైన రేపల్లెకు చెందిన వానా అహరోన్‌పాల్ మంగళవారం గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త డాక్టర్ గణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో నిర్లక్ష్యం చూపుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఆయా అంశాలపై ప్రజలను చైతన్యం చేసి గత ప్రభుత్వం చేసిన మంచి, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న దగాను వివరించాలని కోరారు. కార్యక్రమంలో చెరుకుపల్లి మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, పెన్షనర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మా రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

రేపల్లె: నాటు సారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా చట్టరీత్యా నేరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడ్డికాయలంక పంచాయతీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటు సారా తాగితే జీవితాలు దుర్భరమవుతాయన్నారు. నాటుసారా ఆరోగ్యాన్ని పాడు చేస్తుందని చెప్పారు. నాటు సారా తయారీని పూర్తిగా నివారించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గుడ్డికాయలంకను నాటు సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తుల సహకారం ఎంతో అవసరం అన్నారు. అనుమానిత గ్రామాలలో తమ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, చట్టా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటు సారా తయారీ, క్రయ విక్రయాలపై గ్రామస్తులు తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా నాటు సారాను గ్రామం నుంచి పూర్తిగా బహిష్కరిస్తామంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ దివాకర్, ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు సహకరించాలి



తెనాలిటౌన్: పట్టణ సుందరీకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెంచుపేట, బాలాజీరావు, బోసురోడ్డు, తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు చెత్తను రోడ్లపై, కాల్వల్లో వేయవద్దని విజ్ఞప్తి చేశారు. శానిటేషన్ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

పెదకాకాని: విద్యార్థులు మహనీయుల చరిత్రపై అవగాహన కలిగి ఉండటం ద్వారా క్రమశిక్షణ, పోరాట తత్వం తెలుసుకోవడంతో పాటు పోటీ పరీక్షలకు దోహదపడుతుందని రిసోర్స్‌పర్సన్ భాను తెలిపారు. పెదకాకాని గ్రంథాలయంలో లైబ్రేరియన్ వేముల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన తరగతులు 30వ రోజుకు చేరాయి. ఈ శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, యోగా, పుస్తక ప్రదర్శన, ఇన్‌డోర్ గేమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ భానుచే విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా సోషల్ క్లాసు చెప్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు త్వరలో నిర్వహించి బహుమతులు అందజేయడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి తెలియజేశారు.

విద్యుత్ మోటారు వైర్లు చోరీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు ఆంజనేయస్వామి గుడివద్ద కార్పొరేషన్ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మోటార్ల విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున దొంగిలించారు. ఉదయం మోటార్లు ఆన్ చేయడానికి వెళ్లిన సిబ్బంది ఆ విషయాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కార్పొరేషన్ ఏఈ అక్కడకు చేరుకుని కట్‌చేసిన వైర్లను పరిశీలించి వెంటనే కొత్త వైర్లు వేసి, దొంగిలించిన నాలుగు మోటార్ల వైర్లు బిగించారు. సుమారు రూ.10 వేల విలువ చేసే వైర్లు దొంగిలించినట్లు గుర్తించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల నుంచి తాడేపల్లి పట్టణ పరిధిలో పలు చోట్ల ఇదేవిధంగా దొంగలు సంచరిస్తూ గ్యాస్ సిలెండర్లు, ఇతర వస్తువులను దొంగిలిస్తున్నారు.

యోగాసనాలతో మానసిక ఉల్లాసం



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శేషన్న

తెనాలిటౌన్: యోగాసనాలతో ఆరోగ్యం మెరుగుపడటమేకాక మనస్సుకు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం, చెంచుపేటలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొని మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు అన్ని పట్టణాల్లో రాష్ట్ర వ్యాప్తంగా యోగా మాసోత్సవాలు జరుగుతున్నట్లు తెలియజేశారు. దీనిలో భాగంగానే పట్టణంలో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగాసనాలు మనిషి ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వివరించారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న యోగా శిక్షణ కార్యక్రమాలు బుధవారం నుంచి చెంచుపేటలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపానికి మార్పు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కాలనీ, పినపాడు, పాండు రంగపేట, మాదాలవారి వీధి, బాలాజీరావుపేట, సుల్తానాబాద్, ఉడాకాలనీ, తదితర ప్రజానీకం శిక్షణ శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు, ఆర్వో రాంప్రసాద్, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయుడికి విశేష పూజలు



మన్యుసూక్త హోమంలో పాల్గొన్న భక్తులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్ లో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక శ్రీహనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి విశేష పూజలు, మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 1108 అరటి పండ్లతో విశేష పూజాది కార్యక్రమాల్లో నిర్వహించారు.180 మంది భక్తులు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితులు నాగ మారుతి బృందం ఆగమోక్తంగా కార్యక్రమాలను జరిపారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అర్చకులు కిరణ్ కుమార్, సురేష్, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, దాతలు కారంశెట్టి అమర్‌నాథ్, తాతా శ్రీనివాసరావు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గాజుల రాజేంద్రప్రసాద్, మాజేటి వెంకటేష్, మద్దు హరీష్, బచ్చు లీలాప్రసాద్, వెచ్చ కృష్ణకిషోర్, గాల్తి సోమ శేఖర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్వర్ట్‌ల పూడికతీత వేగవంతం చేయాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



చిట్టి ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో కల్వర్ట్‌ల పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్

తెనాలిటౌన్: పట్టణంలోని కల్వర్ట్‌ల వద్ద పేరుకుపోయిన మురుగు, చెత్త, చెదారం పూడికతీత పనులు వేగవంతం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మంగళవారం పట్టణంలో నిర్వహిస్తున్న కల్వర్ట్‌ల పూడికతీత ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి గుడివద్ద జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ప్రజలు కాల్వల్లో చెత్త చెదారం వేయడం వలన భారీగా మురుగు పేరుకుపోయి నీటిపారుదల జరగకపోవడంతో పలు ప్రాంతాల్లో దుర్వాసన వస్తుందని వెల్లడించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాల్వల్లో చెత్తచెదారం వేయవద్దని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది పట్టణ ప్రజలను ఈ విషయంపై చైతన్యపరచాలని ఆదేశించారు. ప్రజలకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా మురుగు, చెత్త చెదారాన్ని ప్రొక్లెయిన్‌తో తీసివేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

దేశరక్షణ వ్యవస్థలో భాగస్వాములవ్వాలి

ప్రత్తిపాడు: దేశ రక్షణ వ్యవస్థలో భాగస్వాములయ్యేందుకు ఎన్‌సీసీ విద్యార్థులు సిద్ధంగా ఉండాలని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్.సుదర్శన్ అన్నారు. గుంటూరురూరల్ మండలం ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో సీఏటీసీ-1 ఎన్‌సీసీ క్యాంప్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్ తరగతులను ప్రారంభించారు. గుంటూరు, పల్నాడు, ప్రకాశం నెల్లూరు జిల్లాల్లోని కళాశాలలు, పాఠశాలల నుంచి 710 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. సుదర్శన్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణలో సైనిక శిక్షణలో ప్రాథమిక దశను పూర్తి చేసుకోవడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చన్నారు. జూన్ 4 వరకు విద్యార్థులకు యోగా, ఎన్‌డీఆర్ఎఫ్ ట్రైనింగ్.. వంటి అనేక అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సామాజిక సేవలో ఎన్‌సీసీ విద్యార్థుల పాత్ర అభినందనీయమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్‌శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మురళీ మోహన్, డాక్టర్ కె.జగదీష్‌లు తెలిపారు. కళాశాల సెక్రటరీ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్, అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ పట్వాల్, సీనియర్ జేసీఓ ఇమాంసాహెబ్ పాల్గొన్నారు.

బాలికల పట్ల వివక్ష వీడాలి

సీడీపీవో అనసూయ



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో అనసూయ

నిజాంపట్నం: బాలికల పట్ల లింగ వివక్ష వీడాలని, బాలికలను అన్నిరంగాలలో అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సీడీపీవో అనసూయ అన్నారు. మండలంలోని కొత్తపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు మంగళవారం పలు అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. లింగ వివక్ష చూపే వారు చట్టరీత్యా నేరస్తులన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తమ పరిధిలో ఎవరైనా బాల్యవివాహాలు జరిపినట్లు తెలిస్తే అధికారులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలు అధికంగా ఉన్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని, తమ వ్యక్తిగత సమాచారంను ఎవరితోనూ పంచుకోరాదని సూచించారు. కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు గాని తెలియజేయాలని సూచించారు. అనంతరం బాలికల కోసం ప్రభుత్వం చేసిన పలు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి శైలజ, సూపర్‌వైజర్ స్వరూపరాణి, అంగన్‌వాడీలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నగరం: మద్యం షాపు నిర్వాహకులు ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలని ఎటువంటి తప్పిదాలు చేసినా కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని మద్యం షాపు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులను నడపాలన్నారు. నౌకర్ నామాలు ఎటువంటి తప్పిదాలు చేయ్యకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత లైసెన్స్‌దారులదేనన్నారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ మారుతి శ్రీరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి

డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు



తుమ్మలపాలెంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: చెత్త నుంచి సంపద సృష్టించి, గ్రామాభివృద్ధికి వినియోగించాలని డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును మోడల్ గోల్డెన్ ఎల్‌టీసీ సెంటర్‌గా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎల్‌పీఓ షెడ్డును పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ పచ్చని మొక్కలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటం హర్షించదగ్గ విషయమన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ బిన్ బ్యాగ్‌లు అందించాలన్నారు. పంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగుతూ తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచేలా డోర్ టు డోర్ తిరిగి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజాను ఆదేశించారు. వెంట డీపీఆర్‌సీపీలు, డిప్యూటీ ఎంపీడీఓ, క్లాప్‌మిత్రలు ఉన్నారు.

